



చెరువును తలపిస్తున్న అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్

చెరువా.. ఆర్టీసీ కాంప్లెక్సా!

- నీట మునిగిన ప్రాంగణం
- ప్లాట్‌ఫారంపైకి నీటి ప్రవాహం
- ప్రయాణికుల ఇబ్బందులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ చెరువును తలపించింది. పాసింజర్ ప్రయాణికులు వేచి ఉండే ప్లాట్‌ఫారంపై వర్షపు నీరు ప్రవహించింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సామాన్లు తడిసిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే పిల్లలతో మహిళలు అవస్థలు పడ్డారు. వాస్తవానికి మెయిన్‌రోడ్డు కంటే ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ పల్లంగా ఉండడంతో వర్షపు నీరు కాంప్లెక్స్‌లోకి పోటెత్తుతున్నది. నీరు బయటకు పోయే మార్గం సరిగా లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. కాగా కాంప్లెక్స్ ఆవరణలో ఒక చెట్టు నేలకొరగడంతో బస్సుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



ప్లాట్‌ఫారంపైకి వచ్చిన వర్షపు నీటిలో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ముంచెత్తిన వాన

జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షం

- రహదారులు జలమయం
- పలు చోట్ల నేలకొరిగిన వృక్షాలు
- స్తంభించిన జనజీవనం

అనకాపల్లి టౌన్/ నర్సీపట్నం/ చోడవరం/ఎలమంచిలి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి):

ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాను ఆనుకుని పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంలో ఆదివారం ఉదయం ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించిపోయింది. రహదారులు జలమయమయ్యాయి.

అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ చెరువును తలపించింది. అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ శారదానగర్‌లో పలు వీధుల్లో వర్షపు నీరు ప్రవహించింది. కశింకోటలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి పలు వీధులతో పాటు జాతీయ రహదారి సైతం చెరువును తలపించాయి. చోడవరంలోని లక్ష్మీపురం రోడ్డుపై భారీ వృక్షం కూలిపోయింది. చోడవరం మండలంలోని దుడ్డుపాలెంలో ఆదివారం ఉదయం పిడుగుపాటుకు 30 గొర్రెలు మృతి చెందాయి. పరవాడ మండలంలోని తిక్కవానిపాలెం గ్రామంలో శనివారం రాత్రి పిట్టగోడ కూలి ఇల్లు ధ్వంసం కావడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. బుచ్చెయ్యపేట మండలంలోని వడ్డాది పాత బ్రిడ్జి పైనుంచి వరద నీరు ప్రవహించింది. నర్సీపట్నం- చింతపల్లి రోడ్డులో ఆర్‌అండ్‌బీ కార్యాలయం దగ్గర మెయిన్ రోడ్డుపై చింతచెట్టు కూలిపోయింది. దీంతో నర్సీపట్నం నుంచి చింతపల్లి వైపు వెళ్లే వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. గొలుగొండ మండలంలోని జోగంపేట నుంచి జమ్మదేవిపేట గ్రామాల మార్గమధ్యంలో చింత చెట్టు కూలిపోయింది. వర్షాలకు ధారగెడ్డ, రాళ్లగెడ్డ, గొరిగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. నక్కపల్లి మండలంలో కుండపోత వర్షం కురిసింది. వర్షాలకు పాయకరావుపేట మెయిన్‌రోడ్డు జలమయమైంది. ఎలమంచిలిలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. రహదారులు జలమయమయ్యాయి.



నర్సీపట్నం ఆంధ్రా బ్యాంక్ సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



ఎలమంచిలి ప్రధాన రహదారిపై వర్షపు నీరు

అధికార యంత్రాంగం అప్రమత్తం

అనకాపల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాలో అన్ని మండలాల్లో తహశీల్దార్లు అందుబాటులో ఉండాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు రికార్డు స్థాయిలో వర్షం కురిసింది. జిల్లాలో సగటున 95.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా చీడికాడలో 150.6 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. మిగిలిన అన్ని మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. కె.కోటపాడు మండలంలో 146.8, దేవరాపల్లిలో 144.2, మాడుగులలో 141.6, చోడవరంలో 131.8, రోలుగుంటలో 125.0, రావికమతంలో 122.6, సబ్బవరంలో 122.2, బుచ్చెయ్యపేటలో 114.8, అచ్యుతాపురంలో 100.8, ఎలమంచిలిలో 96.8, పరవాడలో 94.8, నర్సీపట్నంలో 92.4, మాకవరపాలెంలో 86.4, మునగపాకలో 77.8, పాయకరావుపేటలో 76.8, కశింకోటలో 75.6, అనకాపల్లిలో 73.2, గొలుగొండలో 71.2, కోటవురట్లలో 59.4, నాతవరంలో 56.8, రాంబిల్లిలో 55.4, నక్కపల్లిలో 53.8, ఎస్.రాయవరంలో 46.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

నేడు పాఠశాలలకు సెలవు

అనకాపల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సోమవారం జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు కలెక్టర్ విజయ కృష్ణన్ సెలవు ప్రకటించారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థుల భద్రత నేపథ్యంలో ముందస్తు సెలవు ప్రకటించినట్టు పేర్కొన్నారు.



చోడవరం మండలంలోని లక్ష్మీపురం రోడ్డులో కూలిన చెట్టు

పిడుగుపాటుకు 30 గొర్రెలు మృతి



పిడుగుపాటుకు మృతి చెందిన గొర్రెలు

చోడవరం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుడ్డుపాలెంలో ఆదివారం ఉదయం పిడుగుపాటుకు 30 గొర్రెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన కూర్మదాసు తాతారావు, మొల్లి గోవింద, కూర్మదాసు రమణలు ఆదివారం ఉదయం గ్రామ సమీపంలోని మెట్టప్రాంతానికి గొర్రెలను మేతకు తీసుకు వెళ్లారు. అదే సమయంలో ఉరుములు మెరుపులతో వర్షం కురుస్తూ పిడుగుపడడంతో గొర్రెలన్నీ అక్కడికక్కడే మృతి చెందాయి. పిడుగుపాటుకు భారీగా గొర్రెలు చనిపోవడంతో పెంపకందారులు తీవ్ర ఆవేదనలో మునిగిపోయారు. రెవెన్యూ, పశుసంవర్థకశాఖ అధికారులు ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు.

తిక్కవానిపాలెంలో కూలిన పిట్టగోడ

- ఒకరికి గాయాలు





కూలిన పిట్టగోడ, (ఇన్‌సెట్‌లో) ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దూడ బంగారి

పరవాడ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు మండలంలోని తిక్కవానిపాలెం గ్రామంలో శనివారం రాత్రి ఓ ఇంటి పిట్టగోడ కూలిపోయి రేకుల షెడ్డుపై పడడంతో ఆ ఇంట్లోని దూడ బంగారి తీవ్రంగా గాయపడ్డారు. అతని భార్య మసేనమ్మ, కుమారుడు క్షేమంగా బయటపడ్డారు. బాధితుడిని కుటుంబసభ్యులు విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది.

నక్కపల్లిలో మోడల్ పోలీస్ స్టేషన్

అత్యాధునిక సదుపాయాలతో భవన నిర్మాణం

- శంకుస్థాపన చేసిన హోం మంత్రి అనిత, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా



నక్కపల్లి పోలీస్ స్టేషన్ నూతన భవన నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న హోం మంత్రి అనిత, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

నక్కపల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నక్కపల్లిలో రూ2.5 కోట్ల వ్యయంతో మోడల్ పోలీస్ స్టేషన్ భవనాన్ని నిర్మిస్తామని హోం మంత్రి అనిత, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. ఆదివారం ఉదయం నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన, భూమి పూజ చేశారు. సీఎస్ఆర్ నిధులతో ఈ భవన నిర్మాణం చేపడుతున్న స్థానిక హెటిరో ఔషధ పరిశ్రమ యాజమాన్యాన్ని హోం మంత్రి అనిత, డీజీపీ అభినందించారు. అత్యాధునిక సదుపాయాలతో ఈ భవన నిర్మాణం జరుగుతుందని హోం మంత్రి చెప్పారు. కాన్ఫరెన్స్ హాల్, ట్రాఫిక్, శాంతిభద్రతల పోలీస్ స్టేషన్లు, సీఐ, ఎస్ఐల రూమ్‌లు, సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూమ్‌లు కూడా వుంటాయన్నారు. అంతకు ముందు హోం మంత్రి అనిత, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాకు పోలీస్ అధికారులు, సిబ్బంది ఘనస్వాగతం పలికారు. అనంతరం డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, డీఐజీ గోపీనాథ్ జెట్టి, ఎస్పీ తుహిన్ సిన్హా, హెటిరో ప్రతినిధులు మూర్తి, శ్రీనివాస్ తదితరులను హోం మంత్రి అనిత ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, నియోజకవర్గంలోని పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

నెల రోజుల్లో పోలీస్ స్టేషన్లకు కొత్త వాహనాలు

- మహిళల రక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ... మెయిన్‌లో
- రాష్ట్ర హోం మంత్రి అనిత

టీచర్లకూ పరీక్షే!

ఎఫ్‌ఏ-1లో తార్కిక ఆలోచనతో కూడిన ప్రశ్నలు

- ఒకటి నుంచి ఎనిమిది తరగతుల విద్యార్థుల్లో అయోమయం
- జవాబులు రాయలేక ఆపసోపాలు
- విద్యార్థులతో పాఠశాల విద్యాశాఖ ఆటలు

విశాఖపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి):

ఈనెల 11 నుంచి 14 వరకు నిర్వహించిన ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్‌ఏ)-1 పరీక్షలలో పాఠశాల విద్యాశాఖ చేసిన ప్రయోగాలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు ఉన్నతాధికారుల అనాలోచిత ఆలోచనతో రూపొందించిన ప్రశ్నపత్రాలకు అనుగుణంగా జవాబులు రాయడంతో విద్యార్థులు తెల్లమొహాలు వేశారు. జవాబుపత్రాలను మూల్యాంకనం చేసే టీచర్లకు కూడా చాలా వరకు ప్రశ్నలు అర్థంకాకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు.

పరీక్షలంటే రెండు రావుల తెల్లకాగితాలపై జవాబులు రాసే విధానానికి స్వస్తిపలికి, బుక్‌లెట్లు ముద్రించి ఏడాది పొడవునా అన్ని పరీక్షలు అందులోనే రాసుకునేందుకు విద్యాశాఖ వీలు కల్పించింది. దీంతో టీచర్లంతా సంతోషించారు. ఏడాదిపాటు విద్యార్థి సామర్థ్యం అంచనా వేయడానికి ఇది ప్రామాణికంగా నిలుస్తుందని భావించారు. అయితే ప్రశ్నపత్రాలను పూర్తిగా మార్చేయడంతో ముఖ్యంగా ఒకటోతరగతి నుంచి ఎనిమిదోతరగతి వరకు విద్యార్థులు జవాబులు రాయడానికి ఇబ్బంది పడ్డారు. గత పాలకులు ప్రపంచ బ్యాంకుతో కుదుర్చుకున్న ఒప్పందం (సాల్ట్ ప్రోగ్రామ్) మేరకు విద్యాసంవత్సరంలో ఎఫ్‌ఏ-1,3, ఎస్‌ఏ-1 ప్రశ్నపత్రాలు రూపకల్పన బాధ్యత ప్రైవేటు రంగానికి చెందిన ప్రథమ అనే సంస్థకు అప్పగించారు.



విద్యాశాఖ రూపొందించిన ఎఫ్‌ఏ-1 బుక్‌లెట్

సిలబస్‌ను కాదని...

ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లంతా సిలబస్ మేరకు పాఠాలు బోధించి, అందులోంచే ప్రశ్నపత్రం రూపొందిచేవారు. అయితే విద్యార్థుల్లో సామర్థ్య స్థాయి పెంచేదిశగా బోధన, పరీక్షల నిర్వహణ ఉంటుందని ప్రపంచబ్యాంకుతో కుదిరిన ఒప్పందంపై ప్రభుత్వం సంతకాలు చేసింది. దీనికి అనుగుణంగా ... మిగతా 6వ పేజీలో

డిగ్రీ ప్రవేశాలకు ఎదురుచూపులు

ఆగస్టు మూడో వారమైనా విడుదల కాని షెడ్యూల్

- గత ఏడాది జూలైలోనే షెడ్యూల్ విడుదల
- ఈ ఏడాది ఇప్పటికీ పట్టించుకోని విద్యాశాఖ
- ఇప్పటికే ప్రత్యామ్నాయ కోర్సుల వైపు పలువురి దృష్టి
- అడ్మిషన్లు తగ్గుతాయని కాలేజీ యాజమాన్యాల ఆందోళన



విశాఖపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం వేలాది మంది ఎదురుచూస్తున్నారు. ఇంటర్మీడియట్ ఫలితాలు వెలువడి మూడు నెలలు దాటుతున్నా ఉన్నత విద్యా శాఖ ఇప్పటి వరకూ డిగ్రీ అడ్మిషన్‌లకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేయలేదు. సాధారణంగా ఇంటర్ ఫలితాలు వెలువడిన నెల రోజుల్లో షెడ్యూల్‌ను విడుదల చేస్తుం టారు. ఈ ఏడాది మాత్రం ఇప్పటికీ విడుదల కాకపోవడంతో అడ్మిషన్స్‌పై ప్రభావం పడుతుందని కాలేజీల యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. డిగ్రీలో చేరుతున్న విద్యార్థుల సంఖ్య గత కొన్నాళ్లుగా తగ్గుతోంది. ప్రవేశాల ప్రక్రియ ఆలస్యమైతే మరింత తగ్గే అవకాశం ఉందన్న ఆందోళన యాజమాన్యాల్లో వ్యక్తమవుతోంది. కరోనా తరువాత డిగ్రీతోపాటు ఇతర ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ ఆలస్యమవుతోంది. గత ఏడాది ... మిగతా 6వ పేజీలో

ఎవరెక్స్ డ్రగ్స్ కంపెనీలో డీఆర్ఐ బృందం సోదాలు

- డ్రగ్స్ ఉత్పత్తులు, నిల్వలు అనుమానాస్పదంగా ఉన్నాయన్న సమాచారంతో తనిఖీలు



ఎస్ఈజెడ్‌లోని ఎవరెక్స్ డ్రగ్స్ కంపెనీ

రాంబిల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా రాంబిల్లి - అచ్యుతాపురం మండలాల పరిధిలోని ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఈజెడ్)లో గల ఎవరెక్స్ డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఆదివారం డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారుల బృందం సోదాలు చేసింది. ఈ కంపెనీలో ఉన్న డ్రగ్స్ ఉత్పత్తులు, నిల్వలు, అనుమానాస్పదంగా ఉన్నాయన్న సమాచారంతో సంబంధిత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఆర్ఐ అధికారులు తనిఖీలు చేశారు. కంపెనీలో తయారు చేస్తున్న మందుల నమూనాలను స్వాధీనం చేసుకొని ప్రయోగాలు చేస్తున్నట్టు సమాచారం. నిషేధిత పదార్థాల ఉనికి, వాణిజ్య ఉల్లంఘనలపై విచారణ జరుగుతున్నదని సమాచారం. కంపెనీ మేనేజ్‌మెంట్‌తో పాటు ల్యాబ్ సిబ్బంది నుంచి డీఆర్ఐ అధికారులు వివరాలు తీసుకున్నట్టు తెలిసింది. ఈ కంపెనీలో డీఆర్ఐ అధికారులు సోదాలు జరుపుతుండడంతో సెజ్‌లోని ఇతర సంస్థల్లో ఆందోళన నెలకొంది. కాగా ఎవరెక్స్ డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో సోదాలపై సంబంధిత అధికారులు అధికారికంగా ప్రకటన చేయాల్సి ఉంది.

ఫలించనున్న రైతుల నిరీక్షణ

త్వరలో వారి ఖాతాల్లో జమకానున్న మినీ గోకులాల పెండింగ్ బిల్లులు

- వివరాలు సేకరిస్తున్న ఉపాధి హామీ సిబ్బంది



జెడ్.గంగవరంలోని మినీ గోకులం షెడ్డు

మాకవరపాలెం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): **మినీ గోకులాల పేరిట షెడ్లు నిర్మించుకున్న రైతుల బ్యాంకు ఖాతాల్లో త్వరలో పెండింగ్ బిల్లులు జమకానున్నాయి. ఈ మేరకు రైతుల వివరాలను ఉపాధి హామీ పథకం సిబ్బంది సేకరిస్తున్నారు.**

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో మినీ గోకులాల పేరుతో రైతులు షెడ్లు నిర్మించుకున్నారు. అప్పట్లో ప్రభుత్వం 90 శాతం రాయితీపై గోకులాల షెడ్లు నిర్మించుకునేందుకు రైతులను ప్రోత్సహించింది. ఆరు పశువులకు సంబంధించి షెడ్డు నిర్మించుకుంటే రూ.లక్షా 60 వేలు, నాలుగు పశువులకు అయితే రూ.లక్షా 30 వేలు చొప్పున మంజూరు చేసింది. ప్రతి రైతు తమ షెడ్డు నిర్మాణానికి అయిన ఖర్చు చూపించే బిల్లు, షెడ్డు ఫొటో తీసి పశుసంవర్థక శాఖాధికారులకు అందజేశారు. బిల్లులు జమ చేయడానికి ఎం.బుక్‌లు సిద్ధం చేశారు. అయితే ఆ తరువాత వైసీపీ అధికారంలోకి రావడంతో షెడ్ల డబ్బులు రైతుల ఖాతాల్లో జమకాలేదు. దీనిపై రైతులు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాలు చేశారు. అలాగే హైకోర్టును ఆశ్రయించారు. కానీ బిల్లులు మాత్రం మంజూరు చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత దీనికి కదలిక వచ్చింది. పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు పశుసంవర్థక శాఖాధికారులను వివరాలు కోరింది. అయితే తమ వద్ద వివరాలు లేవని ఆ శాఖ చేతులెత్తేసింది. దీంతో ఉపాధి హామీ పథకం సిబ్బంది ద్వారా రైతుల వివరాలు సేకరిస్తున్నారు. గ్రామాలవారీగా రైతుల నుంచి గత పది రోజులుగా గోకులాల షెడ్ల వివరాలు తీసుకుంటున్నారు. రైతుల వద్దకు వెళ్లి రైతు ఫొటో, పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్‌లను అప్‌లోడ్ చేస్తున్నారు. 15 రోజుల్లో పెండింగ్ బిల్లులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని ఉపాధి హామీ పథకం సిబ్బంది చెబుతున్నారు.



ఎలమంచిలి పట్టణంలోని రహదారిపై నిలిచిపోయిన వర్షం నీరు



మునగపాకలో హోరున కురుస్తున్న వాన



అచ్యుతాపురం: చోడపల్లి గ్రామంలో పడుతున్న వర్షం

భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం

ఎడతెరిపి లేని వానతో ఏరులై పారిన రహదారులు

రాకపోకలకు వాహన చోదకుల పడరాని పాట్లు

స్తంభించిన జన జీవనం.. నీట మునిగిన పొలాలు

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఏర్పడిన అల్ప పీడనం కారణంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎలమంచిలి నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల్లో కుండపోత వాన పడింది. ఆదివారం రోజంతా కురిసిన ఎడతెరిపి లేని వర్షాలకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులు ఛిద్రమయ్యాయి. పంట పొలాలు నీట మునిగాయి. వర్షానికి వాహన చోదకులు, ప్రజలు, రైతులు, కూలీలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు.

ఎలమంచిలి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలిలో ఆదివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా రోజంతా వర్షం కురిసింది. క్షణం గ్యాప్ ఇవ్వకుండా కురిసిన వర్షానికి జనం ఇళ్లకే పరిమితమయ్యారు. వ్యాపార సముదాయాలు, చిరు వ్యాపారులు దుకాణాలు తెరిచేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో పట్టణంలో అధిక శాతం మంది వ్యాపారులు తమ దుకాణాలను మూసివేశారు. రోజంతా కురిసిన వర్షానికి పట్టణంలో పలు చోట్ల రోడ్లు జలమయమైనాయి. రోడ్లపై వర్షం నీటితో పాటు డ్రైనేజీ కాలువల్లోని మురుగు నీరు నిలిచిపోవడంతో ప్రజలు, వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందులు తప్పలేదు. పట్టణంలో పక్షం రోజుల క్రితం మునిసిపల్ అధికారులు లక్షలాది రూపాయలు వెచ్చించి డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టినా రోడ్లపై నీరు నిలిచిపోవడాన్ని పలువురు పూడికతీత పనులు తీరుపై పలువురు విమర్శలు చేస్తున్నారు. ప్రధాన రోడ్డుపై ఆర్టీసీ బస్టాండ్ ఔట్‌గేటు ముందు, ఎల్ఐసి కార్యాలయం జంక్షన్ వద్ద రోడ్డుపైనే నీరు నిలిచిపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. క్లబ్ రోడ్డు, ఎంపీడీవో కార్యాలయం రోడ్డు, సైతారుపేట రోడ్లు జలమయమయ్యాయి. పాత సీహెచ్‌సీ ఆవరణంతా వర్షం నీటితో నిండిపోయింది. రాజీవ్ క్రీడామైదానం ఎప్పటిలాగానే చెరువును తలపిస్తున్నది.



ఎలమంచిలి పాత సీహెచ్‌సీ ఆవరణలో చేరిన వర్షం నీరు

మునగపాకలో...

మునగపాక, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఆదివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన వీధుల్లోని సైతం రహదారులపై నీరు నిలిచిపోయింది. వ్యవసాయం, పశుపోషణ ఆధారిత మండలం కావడంతో పనులకు విఘాతం ఏర్పడింది. పశుపోషణ కష్టతరంగా మారడంతో పాటు వ్యవసాయ సాగు పనులు నిలిచిపోయాయి. వర్షం మరింత అధికమైతే వ్యవసాయ రంగానికి నష్టం కలిగే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. అయితే అతివృష్టి లేకుంటే అనావృష్టి కారణంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాంబిల్లిలో...

రాంబిల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురుస్తూనే ఉండడంలో ఇళ్లలోని ప్రజలు బయటకు రాని పరిస్థితి ఏర్పడింది. వర్షం కారణంగా గ్రామాల్లోని ప్రధాన రహదారులు, కూడళ్లు జలయమై నిర్మానుష్యంగా మారిపోయాయి. పంట పొలాలు, కాలువలులో కూడా వర్షం నీరు చేరింది. ఎండిపోతున్న వరినారు మడులకు ఈ వర్షం ఊపిరినిచ్చింది. కొబ్బరి తోటలకు, అపరాల పంటలకు ఈ వర్షం ఎంతో మేలు చేకూరుస్తుందని పలు గ్రామాల రైతులు తెలిపారు. మేజర్, మైనర్ శారదా నదుల్లో కూడా నీరు ప్రవహిస్తుండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

అచ్యుతాపురంలో...

అచ్యుతాపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం ముసురు వాతావరణం ఏర్పడింది. తెల్లవారు జామునుంచి వర్షం కురుస్తునే ఉంది. దీంతో ప్రజా జీవనం స్తంభించింది. అచ్యుతాపురం జంక్షన్‌లో పరిస్థితి దారుణంగా తయారైంది. ఫై ఓవర్ నిర్మాణం జరుగుతుండడంతో జంక్షన్ బురదమయమైంది. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. ఆదివారం రాత్రి వరకు వర్షం కురుస్తునే ఉంది.

రోడ్డు దిగితే ఇరుక్కున్నట్లే..!



కొండకర్ల జంక్షన్ వద్ద ఇరుక్కున్న లారీ

అచ్యుతాపురం/అచ్యుతాపురం రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డులో వాహన చోదకుల పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. అచ్యుతాపురం జంక్షన్ నుంచి కొండకర్ల జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. దీంతో రోడ్డుకిరువైపులా మట్టి రోడ్డు అధ్వానంగా తయారైంది. వాహనాలు ఏ మాత్రం తారు రోడ్డు దిగినా ఇరుక్కుపోతున్నాయి. ఆదివారం వర్షం కురియడంతో రోడ్లు బురదమయమయ్యాయి. భారీ వాహనాలు ఎదురుగా వచ్చే వాహనాలకు దారి ఇచ్చే సమయంలో రోడ్డు పక్క కూరుకుపోతున్నాయి. ఆదివారం అచ్యుతాపురం, కొండకర్ల జంక్షన్ మధ్య వాహనాలు కూరుకుపోవడడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కోటవురట్ల హైస్కూల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కోటవురట్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1991-92లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు.పలువురు విద్యార్థులు మాట్లాడుతూ అప్పటి కళాశాల ప్రిన్సిపాల్ షరీఫ్ క్రమశిక్షణను గుర్తుతెచ్చారు. అనంతరం తమకు బోధించిన గురువులను ఘనంగా సత్కరించారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం

పాయకరావుపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీలో ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో రోగులకు రొట్టె, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఆచంట రామకృష్ణ, దాసరి శ్రీనివాసరావు, నేషనల్ కౌన్సిల్ మాజీ సభ్యులు జీవీడీ ప్రసాద్‌బాబు, పల్లా ప్రసాద్, వెలగా సత్యనారాయణ, ప్రసాద్, కె.నాగార్జున, సఖిలేటి రాము, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నాగులాపల్లిలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

మునగపాక, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాగులాపల్లి గ్రామంలో ఈ నెల 18వ తేదీ నుంచి రాష్ట్ర స్థాయి స్త్రీ, పురుషులు వేర్వేరు కబడ్డీ పోటీలు జరగనున్నాయని రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు దొడ్డి శ్రీనివాసరావు తెలిపారు. పోటీలు జరగనున్న మైదానం వద్ద ఆదివారం వలంటీర్లకు టీషర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ వరకు పోటీలు జరుగుతాయన్నారు. వర్షం పడినా ఇబ్బందిలేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఫ్లడ్‌లైట్లు మధ్య పోటీలు సాగుతాయన్నారు.

జిల్లా ఎన్ఎస్ఎస్ నోడల్ ఆఫీసర్‌గా తాతయ్యనాయుడు



ఏయూ వీసీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న తాతయ్యనాయుడు

పాయకరావుపేట, ఆగస్టు 17 : జిల్లా ఎన్ ఎస్ఎస్ నోడల్ ఆఫీసర్‌గా పాయక రావుపేటకు చెం దిన జి.తాతయ్య నాయు డు నియ మితులయ్యారు. ఆదివారం శ్రీప్రకాష్ విద్యా సంస్థల అ నుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి ఈ వివరాలు అందించారు. తమ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీస ర్ తాతయ్య నాయుడు ఈ ఏడాది ఉత్తమ ఆఫీసర్‌గా అవార్డును ఏయూ వీసీ జీపీ.రాజశేఖర్ నుంచి అందు కోవడంతోపాటు ఆయనను జిల్లా ఎన్ఎస్ఎస్ నోడల్ ఆఫీసర్‌గా నియమించినట్టు తెలిపారు. తాతయ్య నాయు డిని ఏయూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డి.సింహాచలం, విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సం యుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ అభినం దించారు.

చెస్‌లో సత్తాచాటిన శ్రావ్యశ్రీ



ఎస్. రాయవరం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని భీమరశెట్టి శ్రావ్యశ్రీ కాకినాడలో నిర్వహించిన రాష్ట్ర బాలికల ఓపెన్ చెస్ టోర్నమెంట్ (ఇండిపెండెన్స్ డే కప్) పాల్గొని సత్తా చాటింది. అండర్-17 బాలికల విభాగంలో శ్రావ్యశ్రీ ఏడు రౌండ్‌లకు గాను ఆరు పాయింట్లు సాధించి ప్రథమ స్థానం సాధించారు. త్వరలో బీహార్‌లో జరగబోయే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు శ్రావ్యశ్రీ తండ్రి యుగేందర్ ఆదివారం తెలిపారు.

చేనేత కార్మికులకు అండగా ప్రభుత్వం

» హోం మంత్రి అనిత

నక్కపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు అండగా ప్రభుత్వం ఉంటుందని, వారి సమస్యలను శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని హోం మంత్రి అనిత చెప్పారు. ఆదివారం మండలం నెల్లిపూడి గ్రామంలో చేనేత కార్మిక దినోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. నేత కార్మికులకు ఉచిత విద్యుత్‌ను 100 యూనిట్ల నుంచి 200 యూనిట్ల వరకు పెంచామని చెప్పారు. 50 సంవత్సరాలు నిండిన చేనేతలకు రూ. 4వేలు పెన్షన్ ఇస్తున్నామని చెప్పారు. పలు చోట్ల యువత మత్తుకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటుందన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల నడవడికను నిరంతరం గమనించాలని సూచించారు.



రాట్నంపై నూలు వడుకుతున్న హోం మంత్రి అనిత

నూలు వడికిన హోం మంత్రి

నెల్లిపూడి గ్రామంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదివారం నేత కార్మికుడు కొల్లి శ్రీనివాసరావు నివాసంపరిశీలించి, అనంతరం మగ్గంపై నూలు వడికారు. చేనేత కార్మికుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రెండు ఉప్పాడ చీరలను కొనుగోలు చేసి కొంత నగదు అందజేశారు.



నెలివాడ సర్పంచ్ సురేశ్ వర్మకు పార్టీలోకి ఆహ్వానిస్తున్న హోం మంత్రి అనిత

టీడీపీలోకి నెల్లిపూడి సర్పంచ్ సురేశ్ వర్మ

నెల్లిపూడి పంచాయతీ సర్పంచ్ సురేశ్ వర్మ సహా మరో 50 మంది టీడీపీలో చేరారు. టీడీపీ నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్ ఆధ్వర్యంలో ఉప సర్పంచ్‌తో పాటు యువకులను హోం మంత్రి కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు చించలపు పద్దు, గింజాల లక్ష్మణరావు, దేవర సత్యనారాయణ, వైబోయిన రమణ, కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా భజన పోటీలు



భజన పోటీల్లో తలపడుతున్న బృందాలు

అచ్యుతాపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోసయ్యపేటలో గల గౌరీ పరమేశ్వర ఆలయంలో ఆదివారం ఉమ్మడి విశాఖ జిల్లాల భజన పోటీలు ఘనంగా నిర్వహించారు. ఓం భారత శక్తి పీఠం వ్యవస్థాపకులు గురూజీ భారతానంద మహారాజ్ పర్యవేక్షణలో గౌరీ సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు సాగాయి. ఉమ్మడి విశాఖ జిల్లాల నలుమూలల నుంచి 26 భజన బృందాలు పాల్గొన్నాయి. మునగపాక మండలం చూచుకొండకు చెందిన శ్రీబాల వినాయక భజన బృందం ప్రథమ స్థానం సాధించి రూ.31 వేలు బహుమతి పొందింది. రాంబిల్లి మండలం కొత్తపేటకు చెందిన భావనారుషి బృందం ద్వితీయ స్థానంలో రూ. 21 వేలు, మూడవ స్థానాన్ని మోసయ్యపేటకు చెందిన దుర్గాభవానీ భజన బృందం కైవసం చేసుకుని రూ. 11వేలు గెలుచుకుంది. బెస్ట్ సింగర్‌గా అగనంపూడికి చెందిన సప్తస్వరాల గీతాంజలి, బెస్ట్ డోలక్ వాయిద్యకారుడిగా హరిపాలెంకి చెందిన అప్పారావు ఎంపికయారు. వీరికి నిప్రత్యేక బహుమతులు అందజేశారు. శరగడం జగ్గప్పారావు, చిట్టి శివ స్వామి, కాకి శంకరరావు, గెద్దాడ నూకరాజు, పాట్నాల భీమేశ్వరరావు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు శరగడం శ్రీధర్, కర్రి శ్రీనివాస రావు, ఎల్లపు వెంకటరావు, పర్రే శ్రీనివాస యాదవ్, పంపంచదార్ల పైడిరాజు, కర్రి శ్రీరామ మూర్తి, ఎల్ అప్పారావు, మద్దాల నూకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లింగన్ననాయుడు పుట్టినరోజు వేడుకలు



హోంమంత్రి సమక్షంలో పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటున్న లింగన్ననాయుడు

కోటవురట్ల, ఆగస్టు 17 (ఆం ధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడు పెట్ల లింగన్ననాయు డు జన్మదిన వేడుకలు హోం మంత్రి వంగలపూడి అనిత సమక్షంలో జరిగాయి. ఆదివారం క్యాంప్ కార్యాలయంలో హోంమంత్రి కేక్ కట్ చేసి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎస్.రాయవరం, పాయకరావుపేట మండల పార్టీ అధ్యక్షులు అబద్ధం, పద్దు, టౌన్ అధ్యక్షులు వరహాలు, జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, నాయకులు పాల్గొన్నారు.

దార్లపూడిలో మరిడిమాంబ విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో ప్రతిష్ఠించిన మరిడిమాంబ విగ్రహం

ఎస్. రాయవరం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దార్లపూడి గ్రామంలో ఉన్న మరిడిమాంబ ఆలయంలో ఆదివారం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ముందుగా అమలాపురం ప్రాంతానికి చెందిన పండితులు చంద్రమౌళి భాస్కర శర్మ ఆధ్వర్యంలో వి గ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానికులు విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువె ళ్లి మరిమాంబ ఆలయం వద్ద ప్రతిష్ఠించారు. అలాగే స్థానిక రామాలయంలో సోమవారం వినాయక విగ్రహంతో పాటు సరస్వతి, నందీశ్వరుల పాలరాతి నూతన విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్టు గ్రామ పెద్దలు పోలిశెట్టి పెద ఈశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

టీచర్లకూ పరీక్షే!

... 5వ పేజీ తరువాయి



మూల్యాంకనం చేసేందుకు బుక్‌లెట్‌లను ఇంటికి తీసుకువెళ్తున్న ఉపాధ్యాయుడు

ఈనెల 11 నుంచి 14వరకు జరిగిన ఎఫ్‌ఏ-1 పరీక్షల్లో బోధనకు అనుగుణంగా కాకుండా తార్కిక విధానం, అనువర్తిత (అప్లికేషన్ మెథడ్) విధానంలో ప్రశ్నపత్రాలు రూపొందించింది. తార్కిక, అనువర్తిత విధానంలోని ప్రశ్నలు కావడంతో విద్యార్థులు జవాబులు రాయలేకపోయారని టీచర్లు వ్యాఖ్యానించారు. జవాబుపత్రాల మూల్యాంకనం చేసే వారికే కొన్ని ప్రశ్నలు అర్థంకాలేదు. మూల్యాంకనంచేసే ముందు గతంలో బోధించే పాఠాలను ఒకటికి రెండుసార్లు చదువుకోవాల్సి వచ్చిందని, గత 20 ఏళ్లగా పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు ప్రశ్నపత్రాలు తయారుచేసే సీనియర్ టీచర్ ఒకరు వ్యాఖ్యానించారు. తొమ్మిది, పదోతరగతి విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నపత్రాలు యథావిధిగా ఉన్నాయని, ఒకటి నుంచి ఎనిమిదోతరగతి విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నపత్రాలతోనే తంటా వచ్చిందని మరో టీచర్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఒకటోతరగతిలో చేరే పిల్లలు ఇప్పుడిప్పుడే పాఠశాలలకు అలవాటుపడుతున్నారు. కొందరు ఆంగ్లం, తెలుగు అక్షరాలు గుర్తుపట్టడంలేదు. వారికి ఇంగ్లీష్‌లో పేరాగ్రాఫ్ ఇచ్చి దానికి ఇంగ్లీష్‌లోనే జవాబులు రాయాలని ప్రశ్నపత్రం ఇచ్చారు. మూడోతరగతి విద్యార్థులకు తెలుగులో పుస్తక సమీక్షచేసి దానిని విశ్లేషణ చేయాలి.. అప్పుడే మార్కులు వేయాలని నిబంధన పెట్టారు. మూడో తరగతి ఆంగ్ల పరీక్షకు నాలుగో తరగతిలోని పాఠాల నుంచి ప్రశ్నలు ఇచ్చారు. గత విధానాన్ని మార్చి బుక్‌లెట్‌లు సరఫరా చేయడంతో వాటిని మూల్యాంకనం చేసేందుకు టీచర్లు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గోనె సంచుల్లో వాటిని కట్టలుగా కట్టి, ఇంటికి తీసుకువెళ్లి పని పూర్తిచేయాల్సిన పరిస్థితి నెలకొంది.

అనాలోచిత నిర్ణయాలు

ప్రశ్నపత్రాలు రూపొందించే ముందు విద్యార్థుల ప్రతిభ, సామర్థ్యం అంచనావేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎస్‌సీఈఆర్టీ విభాగం నిర్వాకంతోనే ఎఫ్‌ఏ పరీక్షలు విమర్శలకు తావిచ్చిందని టీచర్లు వ్యాఖ్యానిస్తున్నారు. గత ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించిన అధికారులు చాలా వరకు పాఠశాల విద్యాశాఖలో తిష్ట వేసి చక్రం తిప్పుతున్నారని, వారి ప్రయోగాలతో కూటమి ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెడుతున్నారని విమర్శించారు. 'హోటల్ యజమాని మారినా, వంటవాడు అక్కడే ఉండడంతో మంచి వంటకం' ఎలా సాధ్యమని వ్యంగ్యంగా ప్రశ్నిస్తున్నారు.

డిగ్రీ ప్రవేశాలకు ఎదురుచూపులు

... 5వ పేజీ తరువాయి

కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించి ఇంజనీరింగ్, డిగ్రీ వంటి కోర్సుల్లో ప్రవేశాల షెడ్యూల్‌ను వేగంగా విడుదల చేసింది. కానీ, ఈ ఏడాది ఆగసు మూడో వారం వచ్చినప్పటికీ షెడ్యూల్ విడుదల కాలేదు. దీనికి ఇద్దరు ఉన్నతాధికారుల మధ్య నెలకొన్న విభేదాలే కారణంగా చెబుతున్నారు.

నూతన విద్యా విధానంలో భాగంగా డిగ్రీలో సింగిల్ మేజర్, డబుల్ మేజర్ సబ్జెక్టులను తీసుకురావాలని ప్రభుత్వం భావించింది. అయితే, ఉన్నత విద్యాశాఖలో పనిచేసే ఇద్దరు ఉన్నతాధికారుల్లో ఒకరు సింగిల్ మేజర్ సబ్జెక్టు తీసుకురావాలని, మరో అధికారి డబుల్ మేజర్ సబ్జెక్టులు తీసుకురావాలని పట్టుబడడంతో షెడ్యూల్ విడుదల కావడంలో జాప్యం ఏర్పడింది. ఎట్టకేలకు సింగిల్ మేజర్ సబ్జెక్టును తీసుకురావాలన్న నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. దీనిపై స్పష్టత రావడంతో కొద్దిరో జుల్లో షెడ్యూల్ వెలువడే అవకాశం ఉందని చెబుతున్నారు.

30 వేల మంది నిరీక్షణ

ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో సుమారు 191 డిగ్రీ కాలేజీలున్నాయి. వీటిలో ఏటా 30 నుంచి 35 వేల మంది వివిధ కోర్సుల్లో చేరుతుంటారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొన్నిసార్లు జాప్యం జరిగినప్పుడు అడ్మిషన్లు 28 వేలకు పడిపోయాయి. గత ఏడాది వేగంగా నిర్వహించడంతో సుమారు 33 వేల మంది డిగ్రీ కోర్సుల్లో చేరారు. ఈ ఏడాది ప్రక్రియ ఆలస్యం కావడంతో అడ్మిషన్లపై ప్రభావం పడుతుందని యాజమాన్యాలు అంటున్నాయి.

ఇంజనీరింగ్‌కు డిమాండ్

విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇంజనీరింగ్ కోర్సుల వైపు ఆసక్తి చూపించడం డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు తగ్గుముఖం పట్టడానికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు మాత్రమే డిగ్రీ కోర్సుల వైపు ఆసక్తి చూపిస్తున్నారు. ఇంజనీరింగ్ కాలేజీలకు ఇష్టం వచ్చినట్టు సెక్షన్స్ పెంచుకునేందుకు అనుమతిం చడం, డిగ్రీ అడ్మిషన్స్‌కు సకాలంలో షెడ్యూల్ విడుదల చేయకపోవడం, డిగ్రీ తరువాత పీజీ కోర్సులు చేసేందుకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వర్తింపజేయకపో వడం వంటి కారణాలతో డిగ్రీ కోర్సులకు డిమాండ్ తగ్గుతోందని కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి. కర్షుడి చావుకు వంద కారణాలన్న చందంగా. .డిగ్రీ కాలేజీలు అంపశయ్యపైకి చేరుకునేందుకు అనేక అంశాలు దోహదం చేస్తున్నాయని ఎంవీపీ కాలనీలోని ఒక కాలేజీ ప్రిన్సిపాల్ నిట్టూర్చారు.

వర్షంతో అవస్థలు



చెరువును తలపిస్తున్న పాయకరావుపేట మెయిన్‌రోడ్డు

పాయకరావుపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేటలో ఎడతెరిపిలేకుండా వర్షాలు పడుతున్నాయి. వర్షానికి మెయిన్‌రోడ్డులో పల్లపు ప్రాంతాలు చిన్నపాటి చెరువులను తలపించాయి.

పాయకరావుపేట రూరల్: ఈ వర్షంతో వర్షాధారమైన కుమారపురం, పాల్తేరు, ఈదటం, కందిపూడి, పాల్మన్‌పేట తదితర గ్రామాలు వరినాట్లు వేయడానికి రైతులు సిద్ధమవుతున్నారు.

నక్కపల్లిలో 53 మిల్లీమీటర్ల వర్షపాతం

నక్కపల్లి: మండలంలో వర్షంతో పజల రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. వరి పంటలకు ఊపిరినిచ్చినట్లయింది. ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకూ మండలంలో 53 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ధర్మవరం అగ్రహారంలో జలమయమైన రహదారి



ధర్మవరం అగ్రహారంలో వరద నీటిలో రాకపోకలు

ఎస్. రాయవరం: ఏకధాటిగా వర్షం కురవడంతో ధర్మవరం అగ్రహారం నుంచి ఎస్ రాయవరం వెళ్లే ప్రధాన రహదారి జలమయమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. ధర్మవరం అగ్రహారానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు సుంకర శ్రీనివాసరావు, బండి నాగేశ్వరరావు తదతరులు రోడ్డుపై నిలిచిన నీరు పక్కనే ఉన్న కాలువ ద్వారా పోయేలా శ్రమదానం చేపట్టారు. అడ్డరోడ్డు నుంచి నర్సీపట్నం వైపు వెళ్లే రోడ్డుతో పాటు సైతారుపేట జంక్షన్ రోడ్డులో వర్షపు నీరు నిలిచిపోయింది.



కొత్తూరు శారదానగర్ 12వ వీధి రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



కశింకోట మెయిన్ రోడ్డుపై భారీగా కురుస్తున్న వర్షం



పరవాడ టీ రాజా హోటల్ సమీపంలో చెరువును తలపిస్తున్న వర్షపునీరు



సబ్బవరం మండలం అంతకాపల్లిలో వరి నాట్లు వేస్తున్న మహిళలు

- ఉదయం నుంచి కురుస్తూనే ఉంది
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఇళ్లకే పరిమితమైన జనం
- గ్రామీణ రహదారులు బురదమయం
- వరి, కూరగాయల పంటలకు మేలని అన్నదాతలు ఆనందం

ఎడతెరిపి లేని వాన





అనకాపల్లి ఉడ్‌పేటలో భారీగా కురుస్తున్న వర్షం..., కొబ్బరికాయల మార్కెట్ వద్ద కాలువలో చెత్త పేరుకుపోవడంతో వాన నీటితో కలిసి రోడ్డుపైకి చేరిన మురుగు

అనకాపల్లి టౌన్/కొత్తూరు/ తుమ్మపాల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం కారణంగా అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా పడడంతో జనజీవనం స్తంభించిపోయింది. అనకాపల్లి పట్టణంలోని ప్రధాన, వీధి రహదారులు నిర్మానుష్యంగా మారాయి. పలు రహదారుల్లో వర్షపునీటితో కాలువలు నిండిపోవడంతో మురుగంతా రోడ్లపైకి చేరింది. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే పాదచారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ చెరువును తలపించింది. విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద నీరు నిలిచిపోవడం వల్ల అనకాపల్లి- చోడవరం మార్గాల్లో వాహన చోదకుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. భారీ వాహనాలు నాయుళ్లవీధి, లక్ష్మీదేవిపేట గేటు మీదుగా రాకపోకలు సాగించాయి. అలాగే, కొత్తూరు పంచాయతీ శారదానగర్‌లోని పలు వీధుల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. ప్రధాన రోడ్డు నదిని తలపించేలా దర్శనమిచ్చింది. ఆదివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో శారదానగర్ 12వ వీధిలో ఎక్కడినీరు అక్కడే నిలిచిపోయింది. కొన్నిచోట్ల కాలువలు నిండిపోయి మురుగుతో రోడ్డుపై ప్రవహించింది. దీంతో ఇళ్లనుంచి పలువురు బయటకు రాలేకపోయారు. కాలువల్లో చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించకపోవడం వలన ఈ దుస్థితి ఏర్పడిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీతానగరం ప్రధాన రోడ్డులోనూ ఇదే పరిస్థితి నెలకొంది. భారీ వర్షాల కారణంగా తుమ్మపాల జంక్షన్, చినబాబు కాలనీ, మార్టూరు జంక్షన్ తదితర ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సెలవు దినం కావడంతో వర్షం వల్ల గ్రామాల్లో ప్రజలంతా ఇళ్లకే పరిమితమయ్యారు.

కశింకోట : తుఫాను కారణంగా ఆదివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా జోరువాన కురిసింది. దీంతో కశింకోట గ్రామ పురవీధుల్లోనే కాకుండా జాతీయ రహదారిపై కూడా నీరు చెరువును తలపించే విధంగా నిలిచిపోయింది. కాలువల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మురుగు నీటితో పాటు కాలువల్లో నీరు కూడా రోడ్డుపైకి చేరింది. దీంతో అక్కడివారంతా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదిలావుంటే, పలు గ్రామాల రహదారులు బురదమయంగా మారడంతో రాకపోకలకు జనం అవస్థలు పడ్డారు.

పరవాడ : మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఈ కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారుల పైనుంచి నీరు పారింది. పరవాడ పెద్ద చెరువు, పైడంబంద చెరువులోకి నీరు సమృద్ధిగా చేరింది. ఎడ తెరిపి లేకుండా కురవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పలు గ్రామాలకు వెళ్లే రహదారులు బురదమయమయ్యాయి. ఫలితంగా అటుగా రాకపోకలు సాగించే ప్రజలు నానా అవస్థలు పడ్డారు. వరి ఆకుమడులు, కూరగాయల పంటలకు ఈ వర్షం ఊపిరి పోసిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లంకెలపాలెం : తుఫాన్ కారణంగా లంకెలపాలెం పరిసర ప్రాంత గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఈ కారణంగా నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా పడడంతో జనం బయటకు రాలేని పరిస్థితి దాపురించింది. భారీగా నీరు చేరి ప్రధాన గెడ్డలు పొంగి ప్రవహించాయి. లంకెలపాలెం నుంచి ఫార్మాసిటీ ప్రధాన రహదారిలోగల ఏలురు కాలువ బ్రిడ్జి వద్దనీరు నిలిచిపోయింది. దీంతో వాహన చోదకుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి.

సబ్బవరం : మండలంలో గత మూడు రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోతోంది. ఈ కారణంగా సబ్బవరం, అంతకాపల్లి, అయ్యన్నపాలెం, గుల్లేపల్లి, అసకపల్లి, మలునాయుడుపాలెం, అమృతపురం, తవ్వవానిపాలెం, మొగలిపురం, ఆరిపాక, వంగలి, గొటివాడ తదితర గ్రామాల్లో ముమ్మరంగా వరి నాట్లు వేస్తున్నారు. మండలంలో సాధరణ వరి సాగు విస్తీర్ణం 1330 హెక్టార్లు కాగా, ఇప్పటి వరకూ సుమారు 300 హెక్టార్లలో వరి నాట్లు వేసినట్టు అధికారులు చెబుతున్నారు. నాట్లు వేసే సమయంలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ తెలిపారు.





వృద్ధురాలి మెడలో రెండున్నర తులాల బంగారం తాడు చోరీ

లంకెలపాలెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : కూరగాయలు అమ్ముకొని ఇంటికి వెళుతున్న వృద్ధ దంపతులను అడ్డగించి ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు ఆభరణాన్ని ఎత్తుకెళ్లిన సంఘటన లంకెలపాలెం రైల్వే బ్రిడ్జి వద్ద చోటుచేసుకొంది. ఇందుకు సంబంధించి బాధితులు పరవాడ పోలీసులకు తెలిపిన వివరాలివి. లంకెలపాలేనికి చెందిన భార్యాభర్త విరోతి గంగరాజు, కన్నమ్మ ఇక్కడి కూడలిలో కూరగాయలు వ్యాపారం చేస్తుంటారు. శనివారం రాత్రి పది గంటల సమయంలో దుకాణం మూసి రైల్వే ట్రాక్ అవతల వైపు ఉన్న ఇంటికి నడుకొని వెళుతున్నారు. ఈ క్రమంలో రైల్వే ట్రాక్ సమీపంలో గుర్తు తెలియని ఇద్దరు దుండగులు వారిని అడ్డగించి కన్నమ్మ మెడలో ఉన్న రెండున్న తులాల బంగారు ఆభరణాన్ని తెంచుకుపోయారు. వారు కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే దొంగలు రైల్వే ట్రాక్ దాటుకుంటూ పరుగుతు తీశారు. ఈ ఘటనపై పరవాడ సీఐ మలికార్జునరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి


కొత్తూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం పిసినికాడ జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందింది. ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఈ సంఘటనకు సబంధించి రూరల్ అదనపు ఎస్ఐ జె.నాగేశ్వరరావు తెలిపిన వివరాలివి. కశింకోట గవరపేట వీధికి చెందిన బొలిశెట్టి వరలక్ష్మి (69) అనకాపల్లి బంధువుల ఇంటికి కాలినడక వస్తుండగా, పిసినికాడ జంక్షన్ వద్ద రోడ్డు దాటుతున్న సమయంలో ఎలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమెను 108 అంబులెన్సులో అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందిందని తెలిపారు. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తుచేస్తున్నామని చెప్పారు.

కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి

కొత్తూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి చెందినట్టు రూరల్ పోలీసు స్టేషన్ ఏఎస్ఐ భూలోకరావు తెలిపారు. అనకాపల్లి మండలం కొండకొప్పాకలో బొడ్డేడ వీరవెంకట సత్యనారాయణ (54), తన భార్య నాగమణితో కలిసి నివాసముంటున్నాడు. ఇతడు ఆటో నడుపుతుండగా, భార్య టీ కొట్టు పెట్టి జీవనం సాగిస్తున్నారు. తరచూ వెంకట సత్యనారాయణ మద్యానికి అలవాటు పడి తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం అనారోగ్య సమస్యలు తట్టుకోలేక పురుగుల మందు తాగాడు. వెంటనే అనకాపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం నిమిత్తం వైద్యులు కేజీహెచ్‌కు పంపారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు.







గడ్డిమందు తాగి చికిత్స పొందుతున్న వివాహిత మృతి

కశింకోట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఓ వివాహిత కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఉమెన్ ఎస్ఐ కె.రమణమ్మ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. జమాదులపాలెం గ్రామానికి చెందిన వియ్యపు రాజేశ్వరి (26) వారం రోజుల క్రితం కుటుంబ సభ్యులతో గొడవ పడి మనస్థాపం చెందిన గడ్డిమందు తాగింది. స్థానికులు అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం వైద్యులు కేజీహెచ్‌కు పంపారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందిందని ఆమె తల్లి అప్పలనర్సమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్ర గాయాలు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు తీవ్ర గాయాలకు గురయ్యారు. ఇందుకు సంబంధించి ట్రాఫిక్ ఎస్ఐ శేఖరం తెలిపిన వివరాలివి. జిల్లాలోని దేవరాపల్లి మండలం కొత్తపెంట గ్రామానికి చెందిన రొంగలి వెంకటలక్ష్మి తన బంధువుతో మునగపాక మండలం కేజీబీవీ స్కూల్‌లో చదువుతున్న పిల్లలను చూసేందుకు శనివారం ద్విచక్ర వాహనంపై వచ్చారు. తిరిగి సాయంత్రం స్వగ్రామానికి వెళ్తుండగా వెనుక నుంచి గుర్తు తెలియని వ్యక్తి వీరి వాహనాన్ని ఢీకొనడంతో వెంకటలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రాథమిక చికిత్సల అనంతరం విశాఖలోని ప్రైవేటు ఆసుపత్రిలో కుటుంబ సభ్యులు చేర్పించారు. ఇదిలావుంటే, అర్ధరాత్రి 12 గంటల సమయంలో జాతీయ రహదారిలోని పూడిమడక జంక్షన్ నుంచి అనకాపల్లి కూరగాయల మార్కెట్‌కు వస్తున్న లారీ పూల్‌బాగ్‌కు వెళ్లే మార్గంలో మలుపు తిరుగుతుండగా ద్విచక్ర వాహనంపై జాతీయ రహదారికి వెళ్తున్న ఆర్.భీమవరం గ్రామానికి చెందిన నమ్మి రమణ, స్థానిక విజయరామరాజుపేటకు చెందిన సుందరపల్లి లోకేశ్‌లను ఢీకొంది. ఈ సంఘటనలో వీరిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనలపై కేసులు నమోదు చేశారు.

ఆ మృతదేహం కృష్ణాదేవిపేట వాసిదే

కశింకోట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : అదృశ్యమైన వ్యక్తి అచూకీకి కోసం తీడ, చెరకాం, అచ్చెర్ల, బంగారయ్యపేటల్లో కశింకోట పోలీసులు పడవ ద్వారా డ్రోన్ కెమెరాల సహాయంతో ఏలేరు కాలువలో గాలించిన సంగతి తెలిసిందే. కాగా ఆదివారం కృష్ణాదేవిపేటకు చెందిన మృతుడి కుటుంబ సభ్యులు ఎన్టీఆర్ ఆసుపత్రిలో భద్రపరిచిన అవయవాలను గుర్తించారు. లోకరపు బుచ్చెయ్యనాయుడు (32) మృతదేహమేనని తండ్రి చిట్టిబాబు గుర్తించినట్టు సీఐ చెప్పారు.

ఎమ్మెల్యే కొణతాల కుమార్తె నిశ్చితార్థానికి ప్రముఖుల హాజరు



కాబోయే వధూవరులతో ప్రముఖులు

విశాఖపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కుమార్తె రమ్య, అనంత్ నిశ్చితార్థ వేడుక బీచ్ రోడ్డులోని హోటల్ నోవాటెల్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీలకు చెందిన ప్రముఖులు హాజరై కాబోయే వధూ వరులను ఆశీర్వదించారు. వీరిలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యేలు పి.విష్ణుకుమార్ రాజు, సుందరపు విజయ్ కుమార్, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, తదితరులు ఉన్నారు.












చింతపల్లి మండలం కిటుములలో నీట మునిగిన పంట పొలాలు


చెరువును తలపిస్తున్న లంబసింగి రహదారి

ఏకధాటి వర్షం..పొంగిన గెడ్డలు

- మునిగిన చింతపల్లి మండలం రాజులపాకలు వాగు వద్ద అప్రోచ్ రోడ్డు
- నర్సీపట్నం-చింతపల్లి మార్గంలో నిలిచి రాకపోకలు

చింతపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో కురుస్తున్న వర్షాలకు రాజుపాకలు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఈ వాగు వద్ద జాతీయ రహదారుల అధికారులు తాత్కాలికంగా నిర్మించిన అప్రోచ్‌రోడ్డు పూర్తిగా మునిగిపోయింది. దీంతో నర్సీపట్నం-చింతపల్లి మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. మినీ వాహనాలు, ద్విచక్రవాహనాలు ప్రత్యామ్నాయ తాజంగి-లోతుగెడ్డ రహదారిలో ప్రయాణిస్తున్నాయి. నర్సీపట్నం-చింతపల్లి ప్రధాన రహదారి రాజుపాకలు వాగు వద్ద జాతీయ రహదారుల ఇంజనీరింగ్ అధికారులు ఆరు నెలలుగా బ్రిడ్జి నిర్మిస్తున్నారు. రాకపోకలకు అంతరాయం కలగకుండా వాగు వద్ద అప్రోచ్ రోడ్డు నిర్మించారు. ప్రస్తుతం అప్రోచ్‌లోనే వాహనాలు నడుస్తున్నాయి. మండలంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురుస్తున్నది. దీంతో సాయంత్రం 4 గంటల నుంచి రాజుపాకలు వాగు వద్ద నీటి ప్రవాహం పెరిగింది. ఐదు గంటలకు అప్రోచ్‌రోడ్డు పూర్తిగా మునిగి సుమారు 50అడుగుల ఎత్తులో నీటి ప్రవాహం వస్తోంది. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సులు, లారీ తదితర భారీ వాహనాలు నిలిచిపోయాయి. కాగా జీపులు, కార్లు, ద్విచక్రవాహనాలు తాజంగి-లోతుగెడ్డ మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. రాజుపాకలు వాగు వద్ద నీటి ప్రవాహం తగ్గితే అప్రోచ్‌రోడ్డు పునరుద్ధరిస్తామని ఎన్‌హెచ్ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం అప్రోచ్ రోడ్డు బ్లాక్ చేసినట్టు తెలిపారు. మండలంలోని లంబసింగి ఆశ్రమ పాఠశాల ఎదురుగా రహదారిపై మూడు అడుగుల ఎత్తు వరకు వర్షపు నీరు చేరుకుంది. దీంతో ప్రాంతీయులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. లంబసింగి, కిటుముల ప్రాంతాల్లో పలు పంట పొలాలు నీట మునిగాయి.

అరకులోయలో భారీ వర్షం

అరకులోయ: అరకులోయలో ఆదివారం మధ్యాహ్నం రెండునుంచి 4 గంటల వరకు భారీ వర్షం పడింది. దీంతో పరిసరాలు, ఘాట్ రోడ్‌లో వాహనచోదకులు, పర్యాటకులు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. రాత్రి ఏడు వరకు వర్షం కురుస్తూనే ఉంది.

నిలిచిన మారుమూల గ్రామాలకు రాకపోకలు

హుకుంపేట: మండలంలో ఆదివారం మధ్యాహ్నంనుంచి వర్షం కుమ్ముతోంది. మండల కేంద్రంలోలో డ్రైనేజీలు లేక పోవటంతో వరద నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. వర్షాలకు మారుమూల గ్రామాలకు వాహనరాకపోకలు నిలిచిపోయాయి. అలాగే, గ్రామాల్లో మట్టి ఇళ్లలో కుటుంబాలతో ఉన్న గిరిజనులు వర్షాలకు బితుబితుకుమంటూ జీవనం సాగిస్తున్నాయి. వాగులు, వంకల్లో నీరు పంట పొలాల్లోకి వచ్చి చేరుతోంది. దీంతో ఉబాలకు వీలవుతుందని రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. మండల కేంద్రంలో చిరువ్యాపారులు వి క్రయాలు లేక ఇబ్బంది ఎదుర్కొంటున్నారు..

చిడిపుట్టు బిడ్జిపైనుంచి పొంగిన వరద నీరు

హుకుంపేట- చిడిపుట్టు మధ్యలోఉన్న వంతెననుంచి వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో అడ్డుమండ, బారపల్లి, గడ్డికించుమండ మూడు పంచాయతీలకు చెందిన ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. మరీ తప్పని వారు సూకురు లేదా, పాడేరు చింతలవీధి మార్గాల్లో ప్రయాణిస్తున్నారు. రాళ్ళగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇక్కడ కల్వర్టు స్థానంలో బ్రిడ్జి నిర్మించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

హెక్టగుడ వద్ద రాకపోకలు బంద్

అనంతగిరి: మండలంలోని ఎగువశోభ పంచాయతీ హెక్టగుడ సమీపంలోని హెక్టగుడ వద్ద కల్వర్టుపై వరద నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు బంద్ అయ్యాయి. సుమారు 20ఏళ్ల క్రితం అప్పటి టీడీపీ హయాంలో రూ.5 లక్షలతో హెక్టగుడ, దండబాడు, తదితర గ్రామాలను దృష్టిలో పెట్టుకుని గెడ్డపై కాలిబాట వంతెన నిర్మించారు. హుద్‌హుద్ తుపాన్‌లోని భారీ వర్షానికి 2014లో వంతెన కొట్టుకుపోయింది. దీంతో అప్పటి నుంచి ప్రభుత్వాలకు వంతెన సమస్యను పరిష్కరించాలని విన్నవిస్తున్నా ఫలితం లేదని, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు చిట్టం మురళి, గ్రామస్థులు రవి, తదితరులు వాపోయారు.

గూడెంకొత్తవీధి: మండలంలో ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి కుండ పోత వర్షం కురుస్తోంది. దీంతో ప్రధాన రహదారులన్నీ వాగులను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలు వర్షపు నీటితో నిండుకున్నాయి. ఆదివారం జర్రెల వారపు సంతలో వర్తకులు, వినియోగదారులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

కొసంపుట్టు ఘాట్ రోడ్డులో విరిగి పడిన కొండ చరియలు

ముంచంగిపుట్టు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిమారుమూల రంగబయలు పంచాయతీ కొసంపుట్టు ప్రధాన రహదారి ఘాట్ రోడ్డులో పలుచోట్ల కొండచరియలు విరిగిపడి వాహన రాకపోకలకు అవరోధం ఏర్పడింది. జోలాపుట్టు వారపు సంతకు వచ్చిన కొసంపుట్టు, జోడిగుమ్మ, పట్నాపడాల్‌పుట్టు తదితర గ్రామాల ప్రజలు తిరిగి వెళ్తున్న సమయంలో రహదారిపై కొండ చరియలు విరిగిపడటంతో భయాందోళన చెందారు. వీరి వాహనాలు వెళ్లిన కొద్ది సమయం తర్వాత బండరాళ్లు రహదారిపై పడడంతో ప్రమాదం తప్పింది. ఆ మార్గంలో సుమారు ఆరు కిలోమీటర్ల వరకు రక్షణ గోడ లేక కొసంపుట్టు ఘాటీ మార్గంలో కొండచరియలు విరిగిపడుతున్నట్టు ఆ ప్రాంతీయులు తెలిపారు. ఏకధాటి వర్షానికి లక్ష్మీపురం, బుంగాపుట్టు, బూసిపుట్టు, రంగయలు తదితర పంచాయతీల పరిధిలో పలు చోట్ల గెడ్డలు వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రహదారులు దెబ్బతిన్నాయి. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.


అరకులోయలో కురుస్తున్న వర్షం


రాజుపాకల వంతెన వద్ద నిలిచిన వాహనాలు

డుంబ్రిగుడలో భారీ వర్షం

డుంబ్రిగుడ: భారీ వర్షాలకు గెడ్డలు వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి కురుస్తున్న వర్షానికి వర్షంపలు రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.


జీకేవీధిలో కురుస్తున్న వర్షం


హుకుంపేట మండలంలో నిండుగా ప్రవహిస్తున్న రాళ్లగెడ్డ


అనంతగిరి మండలం హెక్టగుడ గెడ్డ అవతల ఉన్న గిరిజనులు

'గుత్తులపుట్టును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి'


మండల సాధన కమిటీ సమావేశంలో పాల్గొన్న పలు గ్రామాల ప్రజలు

పాడేరురూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి):పాడేరు మండలానికి చెందిన గుత్తులపుట్టు పంచాయతీ కేంద్రాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో గురువారం గుత్తులపుట్టులో భారీ ర్యాలీని చేపట్టారు. అనంతరం అక్కడి మార్కెట్ యార్డ్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సాధన కమిటీ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం కొత్త మండలాల ఏర్పాటుకు జీవో జారీ చేసిన నేపథ్యంలో ప్రస్తుతం పెదబయలు మండలానికి 70 కిలో మీటర్ల దూరంలో ఉన్న ప్రజలతో పాటు పాడేరుకు దూరంగా పంచాయతీలు, హుకుంపేటలో కొన్ని గ్రామాలను కలుపుకొని గుత్తులపుట్టును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం ఉన్న కొన్ని పంచాయతీలు మండల కేంద్రాలకు సుమారు 30 నుంచి 70 కిలో మీటర్లు దూరంలో ఉండటం వల్ల మారుమూల గ్రామాల్లో సరైన రహదారి సౌకర్యం లేక అభివృద్ధికి దూరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ఏఎస్.దినేశ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో గుత్తులపుట్టు మండల సాధన కమిటీ సభ్యులు వి.రాంబాబు, డి.సన్యాసిరావు, టి.ప్రసాద్ నాయుడు, వి.సూరిబాబు, ఎం.బాబూజీ, బి. బెన్నయ్యపడాల్, వి.రామన్న, చందు, సింహాచలం, భాస్కర్, పి. మత్స్యకొండబాబు, ఎ.ఆనంద్, ఎం.గోపాలపాత్రుడు, టి.మహేష్, రాజు, పి.నాగేశ్వరరావు, బాలంపడాల్, సింహాచలం పాటు 16 పంచాయతీలకు చెందిన పెసా కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

డముకు వద్ద గోతుల పూడ్చివేత


గుంతల పూడ్చివేత పనులను పర్యవేక్షిస్తున్న జడ్పీటీసీ గంగరాజు, సర్పంచ్ మోస్య తదితరులు

అనంతగిరి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అరకు- విశాఖ ప్రధాన రహదారిలోని డముకు సమీపంలో గోతులను జడ్పీటీసీ సభ్యులు దీసరి గంగరాజు చొరవ తీసుకుని పూడ్చారు. ఆదివారం ఉదయం శ్రమదానంతో గుంతలు వద్ద రాళ్లను పేర్చి, ట్రాక్టర్ ద్వారా గుంతలపై మట్టిని పోయించారు.. దీంతో కొంతవరకు రాకపోకలకు ఇబ్బందులు తప్పాయి. ఇక్కడి గుంతలతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నట్టు కలెక్టర్ దినేశ్‌కుమార్‌కు జడ్పీటీసీ ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఇకనైనా రోడ్డు మరమ్మతు చేపట్టేలా చర్యలు తీసకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలోని టోకూరు సర్పంచ్ మోస్య, మధుసూదన్, సీపీఎం నాయకులు దేవన్న, మధు, పాల్గొన్నారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం

అనంతగిరి,ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఏపీయూడబ్ల్యూజే 69వ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చిలకలగెడ్డ వద్ద రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని జర్నలిస్టులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు బి.లక్ష్మణ్‌రావు, కె.వెంకటేశ్, కె.నగేశ్, జి.నరేంద్ర, ఎం.చందు, ఎస్‌కే.మదీనా, డి.ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకూ పరీక్షే!

... 5వ పేజీ తరువాయి


మూల్యాంకనం చేసేందుకు బుక్‌లెట్‌లను ఇంటికి తీసుకువెళ్తున్న ఉపాధ్యాయుడు

ఈనెల 11 నుంచి 14వరకు జరిగిన ఎఫ్‌ఏ-1 పరీక్షల్లో బోధనకు అనుగుణంగా కాకుండా తార్కిక విధానం, అనువర్తిత (అప్లికేషన్ మెథడ్) విధానంలో ప్రశ్నపత్రాలు రూపొందించింది. తార్కిక, అనువర్తిత విధానంలోని ప్రశ్నలు కావడంతో విద్యార్థులు జవాబులు రాయలేకపోయారని టీచర్లు వ్యాఖ్యానించారు. జవాబుపత్రాల మూల్యాంకనం చేసే వారికే కొన్ని ప్రశ్నలు అర్థంకాలేదు. మూల్యాంకనంచేసే ముందు గతంలో బోధించే పాఠాలను ఒకటికి రెండుసార్లు చదువుకోవాల్సి వచ్చిందని, గత 20 ఏళ్లుగా పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు ప్రశ్నపత్రాలు తయారుచేసే సీనియర్ టీచర్ ఒకరు వ్యాఖ్యానించారు. తొమ్మిది, పదోతరగతి విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నపత్రాలు యథావిధిగా ఉన్నాయని, ఒకటి నుంచి ఎనిమిదోతరగతి విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నపత్రాలతోనే తంటా వచ్చిందని మరో టీచర్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఒకటోతరగతిలో చేరే పిల్లలు ఇప్పుడిప్పుడే పాఠశాలలకు అలవాటుపడుతున్నారు. కొందరు ఆంగ్లం, తెలుగు అక్షరాలు గుర్తుపట్టడంలేదు. వారికి ఇంగ్లీష్‌లో పేరాగ్రాఫ్ ఇచ్చి దానికి ఇంగ్లీష్‌లోనే జవాబులు రాయాలని ప్రశ్నపత్రం ఇచ్చారు. మూడోతరగతి విద్యార్థులకు తెలుగులో పుస్తక సమీక్షచేసి దానిని విశ్లేషణ చేయాలి.. అప్పుడే మార్కులు వేయాలని నిబంధన పెట్టారు. మూడో తరగతి ఆంగ్ల పరీక్షకు నాలుగో తరగతిలోని పాఠాల నుంచి ప్రశ్నలు ఇచ్చారు. గతవిధానాన్ని మార్చి బుక్‌లెట్‌లు సరఫరా చేయడంతో వాటిని మూల్యాంకనం చేసేందుకు టీచర్లు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గోనె సంచుల్లో వాటిని కట్టలుగా కట్టి, ఇంటికి తీసుకువెళ్లి పని పూర్తిచేయాల్సిన పరిస్థితి నెలకొంది.

అనాలోచిత నిర్ణయాలు

ప్రశ్నపత్రాలు రూపొందించే ముందు విద్యార్థుల ప్రతిభ, సామర్థ్యం అంచనావేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎస్‌సీఈఆర్టీ విభాగం నిర్వాకంతోనే ఎఫ్‌ఏ పరీక్షలు విమర్శలకు తావిచ్చిందని టీచర్లు వ్యాఖ్యానిస్తున్నారు. గత ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించిన అధికారులు చాలా వరకు పాఠశాల విద్యాశాఖలో తిష్ట వేసి చక్రం తిప్పుతున్నారని, వారి ప్రయోగాలతో కూటమి ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెడుతున్నారని విమర్శించారు. 'హోటల్ యజమాని మారినా, వంటవాడు అక్కడే ఉండడంతో మంచి వంటకం' ఎలా సాధ్యమని వ్యంగ్యంగా ప్రశ్నిస్తున్నారు.

డిగ్రీ ప్రవేశాలకు ఎదురుచూపులు

... 5వ పేజీ తరువాయి

కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించి ఇంజనీరింగ్, డిగ్రీ వంటి కోర్సుల్లో ప్రవేశాల షెడ్యూల్‌ను వేగంగా విడుదల చేసింది. కానీ, ఈ ఏడాది ఆగసు మూడో వారం వచ్చినప్పటికీ షెడ్యూల్ విడుదల కాలేదు. దీనికి ఇద్దరు ఉన్నతాధికారుల మధ్య నెలకొన్న విభేదాలే కారణంగా చెబుతున్నారు.

నూతన విద్యా విధానంలో భాగంగా డిగ్రీలో సింగిల్ మేజర్, డబుల్ మేజర్ సబ్జెక్టులను తీసుకురావాలని ప్రభుత్వం భావించింది. అయితే, ఉన్నత విద్యాశాఖలో పనిచేసే ఇద్దరు ఉన్నతాధికారుల్లో ఒకరు సింగిల్ మేజర్ సబ్జెక్టు తీసుకురావాలని, మరో అధికారి డబుల్ మేజర్ సబ్జెక్టులు తీసుకురావాలని పట్టుబడడంతో షెడ్యూల్ విడుదల కావడంలో జాప్యం ఏర్పడింది. ఎట్టకేలకు సింగిల్ మేజర్ సబ్జెక్టును తీసుకురావాలన్న నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. దీనిపై స్పష్టత రావడంతో కొద్దిరో జుల్లో షెడ్యూల్ వెలువడే అవకాశం ఉందని చెబుతున్నారు.

30 వేల మంది నిరీక్షణ

ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో సుమారు 191 డిగ్రీ కాలేజీలున్నాయి. వీటిలో ఏటా 30 నుంచి 35 వేల మంది వివిధ కోర్సుల్లో చేరుతుంటారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొన్నిసార్లు జాప్యం జరిగినప్పుడు అడ్మిషన్లు 28 వేలకు పడిపోయాయి. గత ఏడాది వేగంగా నిర్వహించడంతో సుమారు 33 వేల మంది డిగ్రీ కోర్సుల్లో చేరారు. ఈ ఏడాది ప్రక్రియ ఆలస్యం కావడంతో అడ్మిషన్లపై ప్రభావం పడుతుందని యాజమాన్యాలు అంటున్నాయి.

ఇంజనీరింగ్‌కు డిమాండ్

విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇంజనీరింగ్ కోర్సుల వైపు ఆసక్తి చూపించడం డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు తగ్గుముఖం పట్టడానికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు మాత్రమే డిగ్రీ కోర్సుల వైపు ఆసక్తి చూపిస్తున్నారు. ఇంజనీరింగ్ కాలేజీలకు ఇష్టం వచ్చినట్టు సెక్షన్స్ పెంచుకునేందుకు అనుమతిం చడం, డిగ్రీ అడ్మిషన్స్‌కు సకాలంలో షెడ్యూల్ విడుదల చేయకపోవడం, డిగ్రీ తరువాత పీజీ కోర్సులు చేసేందుకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వర్తింపజేయకపో వడం వంటి కారణాలతో డిగ్రీ కోర్సులకు డిమాండ్ తగ్గుతోందని కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి. కర్ణుడి చావుకు వంద కారణాలన్న చందంగా. డిగ్రీ కాలేజీలు అంపశయ్యపైకి చేరుకునేందుకు అనేక అంశాలు దోహదం చేస్తున్నాయని ఎంవీపీ కాలనీలోని ఒక కాలేజీ ప్రిన్సిపాల్ నిట్టూర్చారు.

ఆర్టీసీ స్థలాన్ని లులూ షాపింగ్ మాల్‌కు ఇవ్వొద్దు: ఈయూ


విజయవాడలో ఆర్టీసీ స్థలం లీజును రద్దు చేయాలని ఆందోళన చేస్తున్న సంఘ ప్రతినిధులు

పాడేరురూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఆర్టీసీ స్థలాన్ని లులూ షాపింగ్ మాల్‌కు కేటాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో రద్దు చేయకుంటే ఆందోళనఉధృతం చేస్తామని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి చందు హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం పాడేరు డిపో వద్ద కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరం మధ్యలో ఉన్న ఆర్టీసీ గవర్నర్‌పేట డిపోలు 1, 2 పాత బస్టాండ్‌కు సంబంధించిన రూ. 400 కోట్లు విలువ చేసే స్థలాన్ని లులూ షాపింగ్ మాల్‌కు కట్టబెట్టేందుకు ప్రభుత్వం జీవో 137ను విడుదల చేయడం అన్యాయమన్నారు.దీనిపై ప్రజాసంఘాలతో కలిసి ఉద్యమ బాట చేపడతామన్నారు. ఆర్టీసీని, ఆర్టీసీ స్థలాలను కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ఈకార్యక్రమంలో ఈ యూ డిపో కార్యదర్శి సాగిన పరమేశ్, నాయకులు పాల్గొన్నారు.

నేటినుంచి డిగ్రీ కళాశాలలో జాతీయ సెమినార్

చింతపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమ, మంగళవారాలు జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం విజయ భారతి తెలిపారు. ఆదివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మేధోసంపత్తి హక్కులు, ఆవిష్కరణలు, సృజనాత్మకత అంశాలపై జాతీయ సెమినార్ ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఈకార్యక్రమానికి ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ బోడయ్యపడాల్, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు హాజరుకానున్నారన్నారు. విద్యార్థులు సెమినార్‌ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటం

- సీఐటీయూ జిల్లా నేత ఉమామహేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

పాడేరురూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పోరాడి సాధించిన కార్మికుల హక్కులు, చట్టాలను కాపాడుకునేందుకు ఉద్యమం చేసేందుకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా సీఐటీయూ కార్యాలయంలో కె.భాగ్యలక్ష్మి అధ్యక్షతన ఆదివారం సంఘ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వల్ల తీవ్రమైన సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకై కేంద్ర ప్రభుత్వం తీరుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్లకు రకరకాల యాప్‌ల పేరుతో తీవ్ర పనిభారం పెంచుతోందన్నారు. అంగన్‌వాడీలతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, ఐటీడీఏ, మెడికల్ కళాశాల, ప్రభుత్వ ఆస్పత్రులలో పనిచేస్తున్న కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాలు కల్పించాలని, ఉచిత బస్సు పథకంతో ఆర్థికంగా నష్టపోతున్న ఆటో కార్మికుల కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో పనిచేస్తున్న దినసరి కార్మికులకు, సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనం అమలు చేయాలని, సీహెచ్‌డబ్ల్యూలను ఆశా కార్యకర్తగా మార్పు చేయాలని, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, స్కూల్ స్వీపర్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందరరావు, మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి శెట్టి నాగరాజు, మెడికల్ కళాశాల కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు సుజాత, ప్రసాద్, ప్రభుత్వాసుపత్రి వర్కర్స్ యూనియన్ నాయకులు ముత్యాలమ్మ, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు దాసమ్మ, ఆర్టీసీ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు భరత్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి

పాడేరురూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ ప్లాస్టిక్ కవర్లను విడిచిపెట్టి పర్యావరణాన్ని పరిరక్షణకు కృషి చేయాలని నర్సీపట్నంనకు చెందిన వాకర్స్ క్లబ్ కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ పిలుపు నిచ్చారు. ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో భాగంగా ఆదివారం పాడేరు వచ్చిన వాకర్స్ క్లబ్ ప్రతినిధులు మోదకొండమ్మ ఆలయంలోని భక్తుల నుంచి గుడ్డ సంచులను అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పాలిథిన్ కవర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్లేట్‌లు, గ్లాసులు వినియోగంతో కలిగే నష్టాలను భక్తులకు వివరించారు.ఈకార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు వియ్యపు గోవింద్, కుప్పిలి మురళీ, వాకాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మోదకొండమ్మ ఆలయం వద్ద భక్తులకు క్లాత్ బ్యాగ్‌లను అందిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

ఇంగ్లీష్ బోధనపై శిక్షణ


మాట్లాడుతున్న రామేశ్వర్‌గౌడ్

అరకులోయ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు ఇంగ్లీష్ పట్టు సాధించేలా ప్రత్యేకంగా పలువురు ఉపాధ్యాయులకు ఆదివారం ఒక్క రోజు ఓరియంటేషన్ కార్యక్రమం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం మోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. విల్2కెన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీషు డైరెక్టర్ రామేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో 40 రోజుల పాటు ఉచిత ఆన్‌లైన్ శిక్షణాతరగతులు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అరకు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఆరు మండలాలల్లోని పాఠశాలల్లో ఎంపిక చేసిన వంద మంది హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఈ ఓరియంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు ఎలా శిక్షణ తరగతులకు ఆన్‌లైన్‌లో హాజరుకావాలో పలు విషయాలను ట్రైనర్ రామేశ్వర్‌గౌడ్ వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ఇంగ్లీషు మాట్లాడటం, చదవటంపై మెలకువలను వివరించారు.జిల్లాలనుంచి సుమారు మూడువేలమంది ఉపాధ్యాయులు ఈ ఆన్‌లైన్ శిక్షణ తరగతులకు హాజరుకాబోతున్నట్లు తెలిపారు.

డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసర్‌కు సన్మానం


పదవీ విరమణ చేసిన రామమూర్తిని సన్మానిస్తున్న దృశ్యం

పాడేరురూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేసిన సీదరి రామమూర్తిని సహోద్యోగులు ఆదివారం ఘ నంగా సన్మానించారు. మం డలంలోని మినుములూరు పం చాయతీ సంగోడి గ్రామానికి చెం దిన ఆయనను స్థానిక కాఫీ హౌ స్‌లో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను పలువురు కొనియాడారు. ఈకార్యక్రమంలో ఉద్యోగులు, కుటుంబీకులు, సంగోడి గ్రామస్తులు పాల్గొన్నారు.



నర్సీపట్నం ప్రధాన రహదారిపై పడుతున్న వర్షం



చోడవరం-చీడికాడ రహదారిపై ఏరులై పారుతున్న వర్షం నీరు



మాడుగుల మండల కేంద్రంలోని రహదారిపై హోరున కురుస్తున్న వాన

భారీ వర్షం.. అతలాకుతలం

ఎడతెరిపి లేని వానతో లోతట్టు ప్రాంతాలు జలమయం

ఛిద్రమైన రహదారులు.. నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

రాకపోకలకు గ్రామీణులు, వాహన చోదకుల పడరాని పాట్లు

నీట మునిగిన పంట పొలాలు.. లబోదిబోమంటున్న రైతులు

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఏర్పడిన అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలోని నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలోని అన్ని మండలాల్లో కుండపోత వాన పడింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం రోజంతా కురిసిన ఎడతెరిపి లేని వర్షాలకు పట్టణ, గ్రామీణ ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. అన్ని మండలాల్లోనూ రహదారులు ఛిద్రమయ్యాయి. వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. పంట పొలాలు నీట మునిగాయి. చాలా చోట్ల కాజ్‌వేల పై నుంచి నీరు ఏరులా పారింది. దీంతో వాహన చోదకులు, ప్రజలు, రైతులు, కూలీలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు.

నర్సీపట్నం/గొలుగొండ/మాకవరపాలెం/నాతవరం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం నియోజకవర్గంలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. నర్సీపట్నంలో శనివారం రాత్రి నుంచి ముసురు పట్టుకుంది. ఆదివారం దఫదఫాలుగా భారీ వర్షం పడింది. అక్కడ నుంచి తెరిపివ్వకుండా వర్షం పడటంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నర్సీపట్నం-చింతపల్లి రోడ్డులో ఆర్‌అండ్‌బీ కార్యాలయం దగ్గర మెయిన్ రోడ్డు మీద చింత చెట్టు పడిపోయింది. దీంతో విద్యుత్ స్తంభం విరిగిపోయి తీగలు నేలను తాకాయి. ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అలాగే ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. వెంకునాయుడుపేట స్కూల్ రోడ్డులో మోకాళ్ల లోతు నీరు పారింది.

గొలుగొండ మండల కేంద్రంతో పాటు పాకలపాడు, జోగంపేట, పాతమల్లంపేట, అమ్మపేట, చీడిగుమ్మల, రావణాపల్లి, ఏటిగైరంపేట, కృష్ణాదేవిపేట, ఏఎల్ పురం, కొత్తఎల్లవరం గ్రామాల్లో భారీ వర్షం పడింది. దీంతో పంట పొలాల్లో వర్షపు నీరు చేరింది. జోగంపేట నుంచి జమ్మదేవిపేట గ్రామాల మధ్యలో చింత చెట్టు కూలిపోయింది. ధారగెడ్డ, రాళ్లగెడ్డ, గొరిగెడ్డ నీరు ఉధృతిగా ప్రవహిస్తున్నది.



గొలుగొండ మండలం జమ్మదేవిపేట రోడ్డుపై నేలకూలిన చింత చెట్టు

మాకవరపాలెం మండలంలో కుండపోత వర్షం కురిసింది. దీంతో మాకవరపాలెం హైస్కూల్ ఆట స్థలం నీటితో నిండిపోయింది. రామన్నపాలెం-జి.వెంకటాపురం రోడ్డు ఛిద్రమైంది. గోతుల్లో నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

నాతవరం మండలంలో ఆదివారం ఉదయం నుండి ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో పంట పొలాలు నీట మునిగాయి. తాండవలో ఎగువ ప్రాంతాల నుంచి 500 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ద్వారా వచ్చి చేరుతోంది. తాండవ గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా, ప్రస్తుతం 373.8 అడుగులకు చేరింది. కుడి, ఎడమ కాలువలకు 175 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు డీఈఈ అనురాధ తెలిపారు



రావికమతం మండలంలోని చినపాచిల పొలాల్లో చేరిన వర్షం నీరు



మాకవరపాలెం: భారీ వర్షానికి ఛిద్రమైన రామన్నపాలెం రోడ్డు

చోడవరం నియోజకవర్గంలో...

చోడవరం/రావికమతం/బుచ్చెయ్యపేట/రోలుగుంట: చోడవరం నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల్లో వాన దంచికొట్టింది. చోడవరం మండలంలో ఆదివారం ఉదయం చిరుజల్లుగా మొదలైన 11 గంటల నుంచి వర్షం ఉధృతమైంది. విరామం లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి పలు ప్రాంతాల్లోని వరి నాట్లు వేసిన పంటపొలాలు నీట మునిగాయి. గవరవరం, లక్కవరం ప్రాంతాల్లో వరి పొలాలు వరదనీరుతో నిండిపోయాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. చోడవరంలోని బాలాజీనగర్, బానయ్యకోనేరు, చీడికాడ రోడ్డుతో పాటు పలు ప్రాంతాలు నీటమునిగాయి. లక్ష్మీపురం రోడ్డులోని మహతి స్కూల్ సమీపంలో రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలిపోయి విద్యుత్ వైర్లు తెగిపోయాయి. దీంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం 5 గంటలకు అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వర్షం నీటితో ప్రధాన రహదారిపై నీరు వాగులను తలపించేలా పారుతోంది. మండలంలో 85 మిల్లీ మీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది.



చోడవరం మండలంలోని గవరవరంలో నీట మునిగిన వరి పొలాలు

రావికమతం మండలంలో ఆదివారం కుండపోత వర్షం పడింది. ఉదయం ఓ మోస్తరు వర్షంతో ప్రారంభమై మధ్యాహ్నం భారీగా కురిసింది. దీంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోయింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడ్డంతో ప్రజలు ఎండ వేడి నుంచి ఉపశమనం పొందారు. ఈ ఏడాదిలో ఇప్పటికి ఇదే భారీ వర్షంగా రైతులు చెబుతున్నారు.

రోలుగుంట ఆదివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి బీఎన్ రోడ్డు మరింత అధ్వానంగా తయారైంది. రెండు నెలల క్రితం మరమ్మతు చేపట్టగా, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రహదారులన్నీ ఛిద్రమై గోతుల మయంగా మారాయి. దీంతో ఈ రహదారి మీదుగా ప్రయాణించాలంటే వాహనదారులు హడలిపోతున్నారు. ఈ వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోలుగుంట బీఎన్ రోడ్డు, శరభవరం-వడ్డిప-బుచ్చెంపేట రోడ్డు, భోగాపురం-కొంతలం రోడ్డు పూర్తిగా ఛిద్రమై రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



నర్సీపట్నంలో విద్యుత్ స్తంభంపై కూలిపోయిన చింత చెట్టు

బుచ్చెయ్యపేట మండలంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వడ్డాది పాత బ్రిడ్జిపై నీరు చేరి రాకపోకలు అంతరాయం కలుగుతోంది. వడ్డాది డైవర్షన్ రోడ్డుకు సమాంతరంగా నీరు ప్రవహిస్తోంది. వీఆర్‌ఆర్ పేటలో కూలిన తాచేరు వంతెన డైవర్షన్ పై నుంచి ప్రవహిస్తున్న వర్షపు నీటితో వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాల కారణంగా ఎటువంటి ప్రమాదం జరిగినా వెంటనే 08934294391 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తహశీల్దార్ కోరారు. అలాగే ఏజెన్సీ నుంచి వచ్చే వారు తాచేరు రోడ్డులో కాకుండా వేరే మార్గాల్లో ప్రయాణించాలని ఎస్ఐ శ్రీనివాసరావు సూచించారు.



బుచ్చెయ్యపేటలోని వడ్డాదిలో ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దేరు నది

మాడుగుల నియోజకవర్గంలో...

మాడుగుల/కె.కోటపాడు/చీడికాడ/దేవరాపల్లి: మాడుగుల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులపై వాన నీరు ఏరులై పారింది. ఎక్కడికక్కడ రోడ్డడ జలమయం కాగా, పంట పొలాల్లోకి నీరు చేరి వరినాట్లు మునిగిపోయాయి. అలాగే నాట్ల కోసం వేసిన వరి నారు కూడా నీట మునిగింది. వర్షం ఏకధాటిగా పడితే వరినాట్లు కుళ్లిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాల కారణంగా ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. చెరువులు, వాగులు, గెడ్డలు దాటే వారు జాగ్రత్తలు పాటించాలని, పశువుల కాపర్లు విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని వారు కోరారు.



నాతవరంలో వర్షానికి తాండవ నీటి మట్టం

కె.కోటపాడు మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో ఆదివారం ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై నుంచి వర్షపు నీరు పారింది. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు బురదమయమయ్యాయి. దీంతో అటుగా రాకపోకలు సాగించే ప్రజలు, వాహన చోదకులు నానా అవస్థలు పడ్డారు. వరి ఆకుమడులు, కూరగాయల పంటలకు ఈ వర్షం ఊపిరి పోసిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రోలుగుంట తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో గోతుల మయమైన రోడ్డు

చీడికాడ మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం కుండపోత వర్షం కురిసింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి ప్రారంభమైన వర్షం సాయంత్రం వరకు ఎడతెరిపిలేకుండా భారీ స్థాయిలో పడింది. దీంతో ఇప్పటికే నాట్లు వేసిన కాలువ కింద పొలాలు జలమయమయ్యాయి. కాగా, మెట్ట ప్రాంత రైతులకు ఈ వర్షపు నీరు ఎంతో ఉపయోగకరమని రైతులు తెలిపారు. వచ్చే రెండు రోజులు తుఫాన్ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలపడంతో నాట్లు వేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు.

దేవరాపల్లి మండలంలోని ఏకధాటిగా భారీ వర్షం పడింది. దీంతో రోడ్లపై వరద నీరు పోటెత్తింది. ఎక్కడికక్కడ నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మూడు రోజులుగా ఏజెన్సీ వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో రైవాడ జలాశయానికి భారీగా నీరు చేరుతుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇప్పటివరకు 111.08 మీటర్ల వరకు నీరు చేరింది. పంట పొలాలకు నీరు చేరడంతో వరి, చెరకు, సరుగుడు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మాడుగులలో భారీ వర్షానికి నీట మునిగిన వరి నాట్లు



చీడికాడలోని పంట పొలాల్లో కురుస్తున్న వర్షం



కె.కోటపాడు ప్రధాన రహదారిపై నిలిచిపోయిన వర్షపు నీరు



దేవరాపల్లి మండల కేంద్రంలో కురుస్తున్న వర్షం

నేడు భమిడిపాటి సత్రం భూముల కౌలు వేలం

చోడవరం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భమిడిపాటి సత్రంకు చెందిన జన్నవరంలోని భూములకు కౌలు వేలం నిర్వహిస్తున్నట్టు దేవదాయ శాఖ ఈవో ఎస్‌వీ.సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు ఈ భూములకు కౌలు వేలం కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఆసక్తి కలిగిన రైతులు ఈ కౌలు వేలంలో పాల్గొనాలని ఈవో విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం

చోడవరం/మాడుగుల/కె.కోటపాడు/రోలుగుంట/బుచ్చెయ్యపేట ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చోడవరంలోని కె.కాలనీ పాఠశాల ఆవరణలో జర్నలిస్టులు మొక్కలు నాటారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు డీవీఎం నాయుడు, సభ్యులు రాంబాబు, కె.శ్రీనివాసరావు, సతీశ్, పారుపల్లి సతీశ్, రఘు, వార్డు సభ్యుడు నేమాల హరి, నాయకులు జనపరెడ్డి చంద్రుడు పాల్గొన్నారు. కె.కోటపాడు మండల పాత్రికేయులు 50 పడకల ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి ఎన్.సతీశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.రాధాకృష్ణ, పాత్రికేయులు జి.బాల గంగాధర్, ఎస్.వెంకట్రావు, ఎన్.శ్రీను, వి.పరమేశ్వరరావు, ఎన్.అప్పారావు, ఎస్.పరమేశ్ పాల్గొన్నారు. రోలుగుంట మండల కేంద్రంలో ఏపీయూడబ్ల్యూజే వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రం జర్నలిస్టులు, మండల యూత్ నాయకులు, కన్నడ సినీ నటులు సిద్ధూ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జర్నలిస్టులు ఆనంద్, శ్రీనివాసరావు, ఈశ్వరరావు, దారబాబు, శ్రీరామమూర్తి పాల్గొన్నారు. బుచ్చెయ్యపేట మండలంలోని దిబ్బిడి బీసీ వసతిగృహంలో సమాజంలో సోషల్ మీడియా ప్రభావం అనే విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నేత శరగడం రామకోటి, వార్డెన్ రామన్నదొర, పాత్రికేయులు పాల్గొన్నారు. మాడుగుల మండల ప్రెస్ క్లబ్ జిల్లా ఉపాధ్యక్షుడు రొబ్బా శ్రీను పర్యవేక్షణలో వేడుకలను నిర్వహించారు. వృద్ధాశ్రమంలో వృద్ధులు, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యుడు రామ్‌కుమార్, హెడ్‌నర్స్ ప్రసన్న, యూనియన్ నాయకులు ఏలూరి సురేశ్, పాత్రికేయులు పుట్టా శ్రీను, బి.జగ్గారావు, కె.నారాయణరావు, టి.శ్రీను, టి.జనార్ధనరావు, భవాని శంకర్, డి.నాయుడు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి చంద్రబాబు పెద్దపీట

▸▸ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

చీడికాడ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దపీట వేస్తున్నారని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. చీడికాడ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు గవిరెడ్డి జగన్నాథం, డైరెక్టర్లు పేరపు అప్పారావు, భూసాల దేముడు నాయుడు ప్రమాణస్వీకార కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులందరికీ అనేక పథకాలు అమలు చేస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. సొసైటీ పాలకవర్గ సభ్యులు రైతులకు అందుబాటులో ఉంటూ వారి సేవకు అంకితం కావాలని కోరారు. రైతులకు కావలసిన ఎరువులు, వ్యవసాయ పనిముట్లు సకాలంలో అందేలా చూడాలని సూచించారు. అనంతరం పాలకవర్గ ప్రతినిధులను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు పోతల చిన్నంనాయుడు, మాజీ ఎంపీపీ పాత్రిని సింహాచలం నాయుడు, టీడీపీ నాయకులు పంచాడ దాలెంనాయుడు, గండి ముసలినాయుడు, గవిరెడ్డి శ్రీనివాసరావు, కురచా సురేష్, యర్రా అప్పారావు, బీళ్ల కోటేశ్వరరావు, దారపు పెద్దినాయుడు, రెడ్డి సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.



సొసైటీ పాలకవర్గ ప్రతినిధులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బండారు

రక్తదానంలో భాగస్వాములు కావాలి

కృష్ణాదేవిపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రక్తదానంలో అందరూ భాగస్వాములు కావాలని సత్యసాయి సేవా సంస్థ జిల్లా సమన్వయకర్తలు శివరామకృష్ణంరాజు, కామరాజు అన్నారు. కృష్ణాదేవిపేట మైత్రి గ్రంథాలయంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం జరిగింది. ఈ శిబిరంలో ఏఎల్‌పురం, చోద్యం, కొంగసింగి, నాగాపురం, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల నుంచి సుమారు 60 మంది రక్తాన్ని దానం చేశారు. నర్సీపట్నం బ్లడ్‌బ్యాంకు సమన్వయకర్త ప్రసాద్, సత్యసాయిసేవా సమితి సభ్యులు పల్లి సత్యనారాయణ, రమణ, శ్రీను, వాసు తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో రక్తాన్ని అందిస్తున్న దాతలు

మార్కెట్లో క్లాత్ సంచుల పంపిణీ

నర్సీపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వాకర్స్ క్లబ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పెదబొడ్డేపల్లి కూరగాయల మార్కెట్లో వస్త్ర సంచులు పంపిణీ చేశారు. మునిసిపల్ ప్రజా ఆరోగ్య విభాగం అధికారులు, సచివాయం సిబ్బందితో కలిసి ఆదివారం వాకర్స్ క్లబ్ సభ్యులు ర్యాలీ చేశారు. ప్లాస్టిక్ నిషేధం సామాజిక బాధ్యత.. ప్లాస్టిక్ వద్దు క్లాత్ సంచి ముద్దు అని నినాదాలు చేశారు. పాలిథిన్ కవర్లలో కూరగాయలు తీసుకు వెళుతున్న వారికి వస్త్ర సంచులు పంపిణీ చేశారు. అనంతరం తేనీటి విందుకు గవర్నర్ కార్యాలయం ఉంచి ఆహ్వానం అందుకున్న బాక్సింగ్ క్రీడాకారిణి మౌనికను సన్మానించారు. వాకర్స్ క్లబ్ ప్రతినిధులు కామిరెడ్డి సత్యనారాయణ, కుప్పిలి స్వామి, ఎంవీరంగారావు, అల్లు అప్పారావు, పిట్ల శ్రీనివాసరావు, వాకాడ శంకర్‌రెడ్డి, బాటీ పాల్గొన్నారు.

ఆ మృతదేహం కృష్ణాదేవిపేట వాసిదే

కశింకోట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : అదృశ్యమైన వ్యక్తి ఆచూకీకి కోసం తీడ, చెరకాం, అచ్చెర్ల, బంగారయ్యపేటల్లో కశింకోట పోలీసులు పడవ ద్వారా డ్రోన్ కెమెరాల సహాయంతో ఏలేరు కాలువలో గాలించిన సంగతి తెలిసిందే. కాగా ఆదివారం కృష్ణాదేవిపేటకు చెందిన మృతుడి కుటుంబ సభ్యులు ఎన్‌టీఆర్ ఆసుపత్రిలో భద్రపరిచిన అవయవాలను గుర్తించారు. లోకరపు బుచ్చెయ్యనాయుడు (32) మృతదేహమేనని తండ్రి చిట్టిబాబు గుర్తించినట్టు సీఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడ్డారు. దేవరాపల్లి మండలం కొత్తపెంట గ్రామానికి చెందిన రొంగలి వెంకటలక్ష్మి శనివారం మునగపాక కేజీబీవీ స్కూల్‌లో చదువుతున్న తమ పిల్లల కోసం ద్విచక్ర వాహనంపై వచ్చారు. తిరిగి వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రాథమిక చికిత్స అనంతరం ఆమెను విశాఖలోని ప్రైవేటు ఆసుపత్రిలో కుటుంబ సభ్యులు చేర్పించారని ఎస్ఐ శేఖరం తెలిపారు.